www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 21 మే 2023
5
తిరుపతి



నీట మునిగి విద్యార్థి మృతి



ప్రజాశక్తి - చంద్రగిరి: నీటిలో దిగిన విద్యార్థి మృతి చెందిన సంఘటన శనివారం చంద్రగిరి మండలం రంగంపేట సమీపంలోని కళ్యాణి డ్యాం వద్ద చోటుచేసుకుంది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం ఒంగోలు జిల్లాకు చెందిన కె.మనీష్ (19) విద్యానికేతన్‌లో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. ఇతను శనివారం రంగంపేట సమీపంలోని కళ్యాని డ్యాం వద్దకు ఈత కొట్టడానికి స్నేహితులతో కలిసి వెళ్లాడు. స్నేహితులందరూ డ్యాం దిగువ భాగాన ఉన్న మడుగులో ఈత కొడుతుండగా మనీష్‌కు ఈత రాక రాకపోవడంతో ప్రాణం కోల్పోయాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఎస్సై కేసు నమోదు చేసి ఘటనపై తోటి విద్యార్థులను విచారిస్తున్నట్లు తెలిపారు.

'ఉపాధి చట్టానికి' మోడీ ప్రమాదం

- అడుగడుగునా నీరుగార్చే కుట్ర
- మోడీ మెడలు వంచైనా పథకాన్ని కాపాడుకుంటాం
- వ్యకాసం రాష్ట్ర అధ్యక్షులు దడాల

ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కూలీలు, నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దేశంలోని పేద ప్రజానీకానికి చేతినిండా పనీ, మూడు పూటలా తిండి పెడుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నీరుగార్చేందుకు కుట్ర చేస్తోందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అన్నారు. ఉపాధి కూలీలపై ఉన్న సవతి ప్రేమతోనే బడ్జెట్లో భారీగా కోత పెట్టిందంటూ ఉద్ఘాటించారు. మోడీ చెర నుంచి ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందామంటూ స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉపాధి కూలీలు నిరసనకు దిగారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా దడాల సుబ్బారావు హాజరై ప్రసంగించారు. ఉపాధి హామీపనుల్లో కేవలం వ్యవసాయ కూలీలే కాకుండా చేతివత్తిదారులు, నిరుద్యోగ యువత పాలుపంచుకుంటుందని వివరించారు. అయితే మోడీ ప్రభుత్వం భారీ కోతలు పెడుతోందని వాపోయారు. గత ఉపాధి హామీ సంవత్సరానికి బడ్జెట్లో రూ.90వేల కోట్లు కేటాయించగా, ఈ బడ్జెట్లో కేవలం రూ.60వేల కోట్లు మాత్రమే కేటాయించిందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా 20కోట్ల జాబ్ కార్డులు ఉండగా, అవసరమైన బడ్జెట్ 2.5లక్షల కోట్లనీ, మరి మోడీ ప్రభుత్వం కేవలం 60వేల కోట్లతోనే సరిపెట్టేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా కాలంలో పనిలేక పస్తులంటున్న ఉపాధి కూలీలకు ఒక్కో కుటుంబానికి రూ.7500లు ఇవ్వమంటే ఇవ్వని మోడీ, కార్పొరేట్లకు మాత్రం రూ.4.5లక్షల కోట్లను రాయితీ కింద మాఫీ చేసిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం ఉపాధి చట్టం ఓ దండగ అంటోందనీ, వైసీపీ మంత్రులు సైతం అందుకు వంత పాడుతున్నారని వాపోయారు. ఉపాధి పనులు కెళ్లే కూలీలను సోమరిపోతుల్లా వైసీపీ మంత్రులు చిత్రీకరిస్తున్నారనీ, ఆ పథకాన్ని రైతుల చేతుల్లో పెట్టాలని డిమాండ్ చేస్తున్నారంటూ మండిపడ్డారు. రైతుల చేతుల్లో ఉన్న భూములు పేద కూలీలకిచ్చేస్తే, ఉపాధి కూలీల సౌఖ్యాన్ని రైతులకిచేస్తారంటూ సవాల్ విసిరారు. ఉపాధి పనులు జరిగే చోట కనీస వసతులు కల్పించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. నీడ, నీరు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలన్న కనీస స్పృహ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం అధికారాన్ని చేపట్టాక సమ్మర్ అలవెన్సులకు కోత పెట్టగా, తట్టా, బుట్ట, పారా, గడ్డపార కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఎగనామం పెట్టిందంటూ ఏద్దేవా చేశారు. మూడు నెలలకోసారి కూడా ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించడం లేదనీ, పని చేసి 15రోజులు దాటితే 0.5 శాతం వడ్డీతో బకాయి చెల్లించాలని చట్టం చెబుతోందన్నారు. మొత్తం మీద మోడీ ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని నీరు గార్చే కుట్ర చేస్తోందనీ, వ్యవసాయ కూలీలు కేంద్రం మెడలు వంచైనా పథకాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్డీవో రామారావుకు వినతిపత్రంఅందజేశారు. జిల్లా కార్యదర్శి తలారి బాలకష్ణ, మురుగేష్, గురవమ్మ, వందవాసి నాగరాజు, అంగేరి పుల్లయ్య, గంధం మణి, నాగరాజు, వరలక్ష్మి, దినమణి, చెల్లమ్మ, పవిత్ర పాల్గొన్నారు.

ఆర్డీవో రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


జాతరలో జగన్ మంత్రం

జాతర సందర్భంగా అధికార పార్టీ ఏర్పాట్లలో జగన్ అలంకరణ (ఫైల్)

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి- తిరుపతి సిటి:

పేరుకేమో తాతయ్యగుంట గంగమ్మ జాతర. చేసేదేమో పైకి మాత్రం ఆలయ పాలకమండలి. నిధులేమో దేవదాయశాఖ, తిరుపతి కార్పొరేషన్, తుడా, టిటిడివి. నిర్వాహణ మొత్తం స్థానిక అధికార పార్టీ కీలకనేత కన్నుసన్నల్లోనే. గంగమ్మకు ఆడపడుచు సారె పేరుతో అధికార పార్టీ ప్రచార యాత్రలు చేపట్టింది. ఆలయ ప్రాంగాణంలోనూ, అలంకరణలోనూ అధికారపార్టీ ప్రచారానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. అన్ని తాము అనుకున్నట్లే జరిగేలా వ్యూహం. ముందస్తు ప్రణాళిక ప్రకారమే అన్ని తాము అనుకున్న సమయానికే జరిగేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఆఖరికి గంగమ్మ జాతరలో ఆలయాన్ని వచ్చే భక్తులు కూడా జగన్ మంత్రం జపించేలా చేసి, అమ్మవారి జాతరను వివాదస్పదం చేయడం గమనార్హం.

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర. శతబ్దాలగా నిర్వహిస్తున్న రాయలసీమలోనే అతిపెద్ద తిరునాళ్లు. ప్రపంచంలోనే ఎక్కడ లేని విధంగా వారం రోజుల పాటు జాతర నిర్వహిస్తారు. ఏడు రోజుల పాటు భక్తులు వివిధ రకాల వేషదారణల్లో ఆలయానికి విచ్చేసి మొక్కులు తీర్చుకుంటారు. ఈ తిరునాళ్లకు తిరుపతి, చిత్తూరు జిల్లాలోనే కాకుండా రాయలసీమ జిల్లాలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలతో పాటు పక్కనే ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ప్రజలకు సైతం తండోప తండాలుగా విచ్చేసి జాతరల్లో పాల్గొంటారు. పాలకులు ఎవ్వరైనా, ఏ పార్టీ అధికారంలో ఉన్న రాజకీయాలు, ప్రాంతాలు, మతాలకు అతీతంగా ఈ పండగను అందరు ఐక్యంగా జరుపుకోవడం ఆనవాయితీ. కానీ ఈ ఏడాది ఆ ఆనవాయితీకి భిన్నంగా జరిగిందని ప్రజలు బహిరంగంగా గుసగుసలాడుకోవడం గమనార్హం. అధికార పార్టీకి చెందిన తిరుపతి ఎంఎల్ఏ అన్ని తానే అన్నట్టు జాతరను జరిపించారు. నిర్వాహణ బాధ్యతలు చేపట్టాల్సిన పాలకమండలిని సైతం పక్కన పెట్టారు. ఆలయ పునర్నిర్మాణం, మహసంప్రోక్షణం, జాతర, సారెలు, పసుపుకుంకుమ, విశ్వరూప దర్శనం అన్నిట్లోనే తాను చెప్పినదే జరిగేలా చేయడంలో విజయం సాధించారు. అన్ని సరే.. గంగమ్మ అమ్మవారికి సైతం రాజకీయ రంగు పులిమి, ఆమెను కూడా వివాదస్పదంలోకి రావడం దారుణం. అమ్మవారి ప్రధాన ఆలయానికి సైతం జగన్ నామస్మరణతో, వైసిపి జెండాలతో పూల అలంకరణ చేసి భక్తులను సైతం విస్తిపోయేలా చేయడం బాధాకరం.

జాతరంతా తన చెప్పుచేతుల్లోనే...

తిరుపతి గంగమ్మ జాతర మొత్తం అధికార పార్టీ శాసన సభ్యుడి చెప్పు చేతుల్లోనే జరిగేలా చేశారంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. తిరుపతికి సమీపంలోని అవిలాల నుంచి అమ్మవారికి రాత్రి 9గంటల ప్రాంతంలో పసుపు కుంకాలు (పుట్టింటి సారె) ఇవ్వడం సరా మామూలే. కానీ ఈసారి దానికి భిన్నంగా వ్యవహరించారు. సాయంత్రం 5 గంటలకే తమకు పుట్టింటి సారె ఇవ్వాలని భీష్మించారు. దీంతో అవిలాలలోనే గంగమ్మ పుట్టింటి పెద్దలు విధిలేక 5 గంటలకే సారెను పంపించారు. అక్కడ సైతం అసంతృప్తితో నామమాత్రంగానే జాతర జరుపుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలపైన తిరుపతి చాటింపు వేయాల్సి ఉంటే 10గంటల నుంచి చాటింపు వేశారని విమర్శలు వెల్లువెత్తాయి. జాతర జరిగినన్ని రోజులు ఎంఎల్ఏ ఆలయం వద్ద ఉంటూ ప్రతిది తను చెప్పినట్లు చేసేలా చర్యలు తీసుకున్నారు. అమ్మవారి సారెలు తీసుకొచ్చే యాత్రలను సైతం అధికార పార్టీ ప్రచార యాత్రగా చేశారని గుసగుసలు తప్పలేదు. సారెలు తీసుకొచ్చిన వారంతా అధికారపార్టీకి చెందిన వారే, సానుభూతిపరులు, శ్రేయోభిలాషులకు తప్ప, ప్రతిపక్షాలకు తావు ఇవ్వలేదు. విఐపి దర్శనాలు లేవంటూనే ఆలయం మొత్తం విఐపిల మయం చేశారు. చివరికి ఆలయ చుట్టుపక్కల మొత్తం వివిఐపిలు, విఐపిల వాహన శ్రేణులతో ట్రాఫిక్ కష్టాలను తెచ్చిపెట్టారు. ముందే ఇరుకైన ప్రాంతం, పైగ వేల సంఖ్యలో భక్తులు, ఇది చాలదన్నట్లు విఐపిలు తాకిడి, వాహనాలతో ట్రాఫిక్ ఇబ్బందులు, కలిసి పోలీసులకు సైతం తలబొప్పికట్టేలా చేశాయి. చివరికి అమ్మవారి జాతర రోజు అసల కథకు తెరలేపారు. ప్రధాన ఆలయానికి ముందు ప్రదాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన పూల అలంకరణ వివాదాలకు తెరలేపింది. సుమారు 4 అడుగుల ఎత్తు, 30 అడుగుల పొడవుతో చేసిన పూల అలంకరణలో కుడి, ఎడమ పక్కల అధికార పార్టీకి చెందని వైసిపి జెండాలను, మధ్యలో జగన్‌కు సింబల్‌గా జెను, దాని పక్కనే గన్‌ను ఏర్పాటు చేసి జగన్ అనే అర్థం వచ్చేలా చేశారు. ఇది భక్తులను సైతం విస్మయానికి గురి చేసింది. ఇంత జరిగినా అదేమి తప్పుకాదని, అలంకరణ చేసిన కాంట్రాక్టరు జగన్‌పై అభిమానంతో అలా చేసి ఉంటాడని ప్రెస్‌మీట్లు పెట్టి మరీ ఊదరగొట్టడం అందర్ని అవాక్కు అయ్యేలా చేసింది. ఉదయం 4 నుంచి 7గంటల మధ్య జరిగే అమ్మవారి విశ్వరూప చెంప నరుకుడు కార్యక్రమం చాలా ప్రాధాన్యతో కూడుకున్నది. అమ్మవారి ప్రతిమ మట్టికోసం సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. కానీ దానికి భిన్నంగా అర్ధరాత్రి ఒంటి గంటకే చంపనరుకుడి కార్యక్రమాన్ని పూర్తిచేశారు. ఇదేమని అడిగితే... ఫలానా కార్యక్రమం ఫలానా సమయానికే చేయాలనే సిద్ధాంతం ఏమైనా ఉందా అనే దోరణిలో భక్తులతో తిరగబడడం గమనార్హం. ఏది ఏమైనా శతబ్దాల చరిత్ర గల గంగజాతరను సైతం అధికార పార్టీ తమ ప్రచారాలకు వినియోగించుకుని, వివాదస్పదం చేయడం పలువుర్ని విస్మయానికి గురి చేసింది. అధికార పార్టీ పెద్దలను ఎదరించలేక, ప్రజలు సైతం అంతా అమ్మవారే చూసుకుంటారంటూ తిట్టుకుంటూరంటు వెళ్లిపోయారు. భక్తుల మనోభావాలతో ఆడుకోవడం సరైనది కాదని పలువురు సాహితీవేత్తలు హితవు పలికారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

ఉపాధి పనుల వద్ద నీరు, నీడ ఏర్పాటు

నిమ్మరసం, మజ్జిగ పంపిణీ చేసిన పీడీ

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఉపాధి హామీ పనులు వద్ద ఆ పథకం అధికారులు యుద్ధ ప్రాతిపదికన నీరు, నీడ వసతులు ఏర్పాటు చేశారు. శనివారం ప్రజాశక్తిలో ఉపాధి హామీ పథకంపై 'నీరు, నీడ ఎక్కడ' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ యుద్ధ ప్రాతిపదికన ఉపాధి పనులు జరిగే చోట నీరు, నీడ ఏర్పాటు చేశారు. ప్రథమచికిత్సా పెట్టెలను అందుబాటులో ఉంచారు. కూలీలు వేసవి తాపాన్ని తట్టుకునేలా సబ్జా నీరు, నిమ్మరసం, మజ్జిగను పంపిణీ చేశారు. పెళ్లకూరు మండలం శిరసనంబేడు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో డ్వామా పిడి స్వయంగా కూలీలకు నిమ్మరసం, సబ్జా నీరు, మజ్జిగ పంపిణీ చేయడం గమనార్హం.

సామాన్య భక్తుల సౌలభ్యం కోసం

ఆర్జిత సేవలు, విఐపి దర్శనాల్లో స్వల్ప మార్పులు

టీటీడీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి- తిరుమల: కోవిడ్ ముప్పు పూర్తిగా తొలగిపోవడం, వేసవి సెలవుల కారణంగా తిరుమలలో భక్తుల రద్దీ రోజురోజుకూ అనూహ్యంగా పెరుగుతోంది. సర్వదర్శనం భక్తులకు దాదాపు 30 నుంచి 40 గంటల సమయం పడుతోంది. శుక్ర, శని, ఆదివారాల్లో భక్తులు వేచి ఉండే సమయం ఇంకా ఎక్కువగా ఉంటోంది. ఈనేపథ్యంలో సామాన్యభక్తుల సౌలభ్యం కోసం జూన్ 30వ తేదీ వరకు స్వామివారి సేవలు, విఐపి దర్శనాల్లో స్వల్ప మార్పులు చేస్తున్నట్లు టీటీడీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్ర, శని, ఆదివారాల్లో సుప్రభాత సేవకు విచక్షణ కోటాను రద్దు చేయడం జరిగింది. తద్వారా 20 నిమిషాల సమయం ఆదా అవుతుంది. గురువారం తిరుప్పావడ సేవ ఏకాంతంగా నిర్వహించడం జరుగుతుంది. తద్వారా 30 నిమిషాల సమయం ఆదా అవుతుంది. శుక్ర, శని, ఆదివారాల్లో విఐపి దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించడం జరగదు. కేవలం స్వయంగా వచ్చే వీఐపీలకు మాత్రమే బ్రేక్ దర్శనం కల్పించడం జరుగుతుంది. తద్వారా రోజు మూడు గంటల సమయం ఆదా అవుతుంది. క్యూలైన్లలో గంటల తరబడి కిలోమీటర్ల మేర వేచి ఉండే వేలాదిమంది సామాన్య భక్తులకు ఈనిర్ణయాల వల్ల త్వరితగతిన స్వామివారి దర్శనం అవుతుంది. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని భక్తులు, వీఐపీలు సహకరించాలని వైవి.సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు.

అండగా ఉంటాం, అధైర్యపడవద్దు

మంటలకు కారణాలు త్వరలో తెలుస్తుంది : ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్ వెంకట రమణారెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి

ప్రజాశక్తి - చంద్రగిరి: అండగా ఉంటాం, అధైర్యపడవద్దు, ఇప్పటికే మంటలు జరిగిన వాటి నమూనాలు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాము, త్వరలో కారణాలు తెలుస్తాయి, తదుపరి ఏమి చేయాలన్నది చేద్దాం అని చంద్రగిరి ఎంఎల్ఏ, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. చంద్రగిరి నియోజకవర్గం కొత్త శానంబట్లలో జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి, అడిషనల్ ఎస్‌పి. వెంకటరావు, అధికారులతో కలిసి ఎంఎల్ఏ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారంగా గ్రామంలో అక్కడక్కడ మంటలు చెలరేగుతున్న వాటిపై ఇప్పటికే నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపామని, త్వరలో నివేదిక వస్తుందన్నారు. మానవ తప్పిదమో, ఆచార సంప్రదాయాల వల్ల జరిగిందా తెలుస్తుందని, రిపోర్టు రాగానే తక్షణ సహాయ చర్యలు చెప్పడానికే నేడు జిల్లా కలెక్టర్ కూడా పర్యటించారు. పగలే మంటలు చెలరేగడం జరుగుతున్నది, భయాందోళన లేకుండా అండగా గ్రామంలో మహిళా పోలీసులు 18మందిని ఇక్కడే ఉంచుతామని అన్నారు. ఇప్పటికే మంటలు చెలరేగిన ఇండ్ల వద్ద పోలీసులు సిసి కెమరాలు ఏర్పాటు, పర్యవేక్షణ చేస్తున్నారని అన్నారు. అపోహాలు, వదంతులు నమ్మవద్దు, త్వరలో కారణాలు తెలుస్తాయి, మరో గ్రామంలో ఇలా జరగకుండా జాగ్రత్త పడుదామన్నారు. గ్రామంలో రూ.3.38 కోట్లు ఖర్చు చేసి అభివద్ధి పనులు రోడ్లు, డ్రైనేజ్, కమ్యూనిటీ హాలు, పశువైద్యశాల, ఆర్ఓ ప్లాంటు ఏర్పాటు తక్షణం ప్రారంభమవుతున్నాయని అన్నారు. గ్రామంలో భాదితులు అయిన అరుణ, రాణి, గోపి, కష్ణ గహాలు సందర్శించి జరిగిన విధానం అడిగి తెలుసుకున్నారు, ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కనకనరసారెడ్డి, పర్యావరణ ప్రొఫెసర్ దామోదర్, ఫైర్ అధికారి రమణయ్య, పోలీసు అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

చంద్రగిరి ఎమ్మెల్యేకి చేదు అనుభవం

ప్రజాశక్తి - చంద్రగిరి:

మండలంలోని కొత్తసానంబట్ల గ్రామంలో చోటు చేసుకున్న మిస్టరీ మంటలపై శనివారం మధ్యాహ్నం సందర్శనకు కలెక్టర్‌తో పాటు వెళ్లిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. 2019 నుంచి గ్రామ అభివృద్ధికి రూ.3.38 కోట్లు ఖర్చు పెట్టినట్లు చెప్పిన ఎమ్మెల్యే ప్రసంగం మధ్యలో మా ఊరికి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని గ్రామస్తుడు నారాయణ రెడ్డి స్పష్టం చేశారు. దీంతో ఖంగుతిన్న అధికారులు లెక్కలు చెప్పే ప్రయత్నం చేశారు. కాగా లెక్కల అంశాన్ని కాగితంపై రాసి ఇంటి ఇంటికి పంపుతామన్న ఎమ్మెల్యే తెలుపడం చర్చనీయాంశమైంది.

వేదిక్ హెరిటేజ్ కారిడార్ ప్రారంభం

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టిటిడి ఈవో ధర్మారెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్, తిరుపతి సిటి: వేదాల్లోని విజ్ఞానాన్ని భావితరాలకు తెలియజేయడం కోసం శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం వేదిక్ హెరిటేజ్ కారిడార్ ప్రారంభించడం అభినందనీయమని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి అన్నారు. ఎస్వీ వేదిక్ యూనివర్సిటీలో శనివారం ఆయన వేదిక్ హెరిటేజ్ కారిడార్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ వేదాలు కొన్నివేల సంవత్సరాల క్రితమే అంతరిక్ష విజ్ఞానం, యాజమాన్య నిర్వహణ, గణితం, ఆరోగ్య సంరక్షణ, యోగ, ఆహారం తీసుకోవాల్సిన విధానం లాంటి దాదాపు 190 అంశాలను కూలంకషంగా వివరించాయన్నారు. వీటి గురించి నేటితరం వారికి తెలియజేసే ప్రయత్నం చేయడం సంతోషకరమని అన్నారు. వీటికి సంబంధించి అంశాలతో వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి రచించిన సంఫాక్ట్స్ ఆఫ్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్, ఎస్సేస్ ఆన్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ అనే రెండు పుస్తకాలను ఈవో ఆవిష్కరించారు. వీటిని వేద విశ్వవిద్యాలయం ప్రచురించింది. మిగిలిన అంశాలపై కూడా పుస్తకాలు రచించి అందుబాటులోకి తేవాలని ఆయన వేదిక్ యూనివర్సిటీ విసిని కోరారు. విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య రాణి సదాశివ మూర్తి మాట్లాడుతూ వేదాలు యజ్ఞయాగాలు నిర్వహించడం, గహాలలో సంస్కారాలు చేసుకోవడానికి మాత్రమే పనికి వస్తాయనేది నేటితరం అభిప్రాయమని తెలిపారు. పూర్వకాలంలో సమాజానికి కావలసిన అన్ని రకాల అవసరాలు తీర్చడానికి వేదాలు, శాస్త్రాలు ఎంతగానో ఉపయోగపడినట్లు వివరించారు. ఆధునిక జీవన విధానంలో వేదవిజ్ఞానం ఏవిధంగా ఉపయోగపడుతుందో తెలియజేయడానికే వేదిక్ హెరిటేజ్ కారిడార్ ఏర్పాటు చేశామని తెలిపారు. నిర్ణీత సమయంలో ఎవరైనా వచ్చి ఈ చిత్రప్రదర్శనను చూసి, విషయాలను తెలుసుకోవచ్చని చెప్పారు. అనంతరం ఈవో మ్యాన్ స్క్రిప్ట్ ప్రాజెక్టు మాస ప్రగతిపై సమీక్ష జరిపారు. తిరుపతి, పరిసర ప్రాంతాల్లోని సంస్థలు, వ్యక్తుల వద్ద ఉన్న మ్యాన్ స్క్రిప్ట్‌ను డిజిటైజ్ చేయడానికి చర్యలు తీసుకుని అవగాహన ఒప్పందాలు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న మ్యాన్ స్క్రిప్ట్‌లను శుభ్రపరచడం, నూనె రాయటం, స్కాన్, డిజిటైజ్ చేసి క్యాటలాగ్స్ రూపొందించి లాకర్లలో భద్రపరచే పని సంతప్తి కరంగా సాగుతోందన్నారు. టీటీడీ, సనాతన జీవన ట్రస్ట్ సంయుక్తంగా చేస్తున్న ఈ కార్యక్రమాన్ని మరింతగా సమాజానికి చేరువ చేసేలా పనిచేయాలని చెప్పారు. జేఈవో సదాభార్గవి, సనాతన జీవన ట్రస్ట్ అధ్యక్షులు శశిధర్, మ్యాన్ స్క్రిప్ట్ ప్రాజెక్టు డిప్యూటీ ఈవో విజయలక్ష్మి, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య రాధేశ్యాం సమీక్షలో పాల్గొన్నారు.

ఈనెల 24న రూ.300ల

ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల

ప్రజాశక్తి- తిరుమల: రూ.300లు ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లకు సంబంధించిన జూలై, ఆగస్టు నెలల కోటాను మే 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించి టీటీడీ వెబ్‌సైట్ https:// tirupatibalaji.ap.gov.inలో దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరడమైనది.

స్మార్ట్‌సిటీ పనులను వేగవంతం చేయండి

మున్సిపల్ కమిషనర్

స్మార్ట్ సిటీ పనులు త్వరగా చేయాలని సూచిస్తున్న కమిషనర్ హరిత

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ పనులను చేసేందు అనుమతి పొంది కూడా పనులు జాప్యం చేయడంపై కాంట్రాక్టర్లను ప్రశ్నిస్తూ, చేపట్టిన పనులను వేగవంతం చేయాలని తిరుపతి స్మార్ట్ సిటీ ఎండి, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం స్మార్ట్ సిటీ ప్రాజెక్టులను చేపట్టిన కాంట్రాక్టర్లతో, స్మార్ట్‌సిటీ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో కమిషనర్ హరిత ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తిరుపతి అభివద్ధికి, ప్రజల సౌకర్యం కోసం చేపట్టిన ప్రాజెక్టులను సాగతీస్తున్నారని, పూర్తి చేయాల్సిన సమయానికి పూర్తి చేయకుండా కారణాలు చెప్పడాన్ని కమిషనర్ హరిత అభ్యంతరం చెబుతూ ప్రాజెక్టుల పూర్తికి ఫేమెంట్స్ తీసుకొని కూడా కాలయాపన చేయడం తగదని అన్నారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులు పూర్తి అవ్వడం కోసం నగర ప్రజల్లో అపోహాలు రావడాన్ని గుర్తించాలని, కాంట్రాక్టర్ల తప్పులకు తాము బాధ్యులు అవ్వాల్సిన పని లేదని, ప్రతి ప్రాజెక్ట్ పనులు జూన్ చివరికల్లా పూర్తి కావల్సిందేనన్నారు. పెద్ద ప్రాజెక్టులు జూన్ చివరికల్లా తుది రూపుకి రావల్సిందేనని నిర్లక్ష్యం వహిస్తే తగుచర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ఒక్కొక్క ప్రాజెక్ట్ గురించి కమిషనర్ చర్చిస్తూ మిగిలిన పనులను ఎంతకాలంలో పూర్తి చేస్తారని కాంట్రాక్టర్లను అడిగారు. వారు చెప్పిన తేదీలను అధికారులతో చర్చించి ఖరారు చేస్తూ చెప్పిన సమయానికల్లా పనులు పూర్తి చేయాలన్నారు. వినాయకసాగర్ మొదటిదశ పనులను, వినాయకసాగర్ షాపింగ్ కాంప్లెక్స్ గ్రౌండ్, మొదటి అంతస్థు పనులను, సిటీ ఆపరేషన్ సెంటర్ పౌండేషన్ పనులను, ఇండోర్ స్టేడియం పనులను, నీటిశుద్ధి ప్లాంట్ పనులను, గొల్లవానిగుంట క్రికెట్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ లాంటివి జూన్ చివరికల్లా పూర్తిచేసి ఓ రూపుకు తీసుకురాకుంటే చర్యలు తప్పవన్నారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, స్మార్ట్‌సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, డీఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్రరెడ్డి, దేవిక, మేనేజర్ చిట్టిబాబు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు అందుబాటులో..

ఏపీఎస్ఎస్‌డిసి - స్కిల్‌హబ్ యాప్: కలెక్టర్

నిరుద్యోగులు ఈ యాప్ ను ఉపయోగించుకోవాలని కోరుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: జిల్లాలో గ్రామీణ, పట్టణప్రాంత నిరుద్యోగ యువత 8వ తరగతి నుంచి ఐటిఐ వరకు చదివిన వారికి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు సాంకేతిక శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్ (ఏపీఎస్ఎస్‌డిసి - స్కిల్‌హబ్) రూపొందించి అందుబాటులోకి తెచ్చిందని అవగాహన కల్పించి యువత సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఎంపిడిఓలతో, మునిసిపల్ కమీషనర్లతో వర్చువల్ విధానంలో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం యాప్ విడుదల చేసిందని, నమోదు చేసుకున్న వారు జిల్లాలోని 08 స్కిల్‌హబ్‌లలో శిక్షణ పొంది ఉపాధి లేదా ఉద్యోగం పొందే అవకాశం ఉందని అలాగే సచివాలయ వాలంటర్లు ఒక్కక్కరు కనీసం ఇద్దరిని గుర్తించి నమోదు చేయాల్సి ఉంటుందని అన్నారు. అలాగే ఇంటర్ 75శాతం మార్కులతో పాసై చదువుకునే స్తోమత లేదని ఖాళీగా ఉండరాదని ఇందుకోసం హెచ్‌సిఎల్ టెక్ వారు ఉద్యోగంతో పాటు డిగ్రీ చదువుకునే అవకాశం బిట్స్ పిలానీ, శస్త్ర, అమిటీ, ఐఎంఎం నాగపూర్, కెఎల్.యూనివర్సిటీ వంటి వాటిలో కల్పిస్తారని అందుకోసం bit.ly/techbee22లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ రెండింటిపై అధికారులు, సచివాలయ వాలింటర్లు శ్రద్ధ చూపి అవకాశాలు కల్పించాలని సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా కో-ఆర్డినేటర్ శ్యామ్ మోహన్, డిఎల్‌డిఓలు సుశీలాదేవి, ఆదిశేషారెడ్డి పాల్గొనగా మండలాలు, మునిసిపాలిటీల నుంచి ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు హాజరైనారు.

ప్రజా చైతన్యంతోనే రాయలసీమ అభివృద్ధి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాయలసీమ ప్రాంత ప్రజలను చైతన్యం చేస్తూ రాయలసీమ అభివృద్ధికి రాయలసీమ సాగునీటి సాధన సమితి కృషి చేస్తుందని సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి తెలిపారు. శనివారం రాయలసీమ సాగునీటి సాధన సమితి తిరుపతి కన్వీనర్ మాంగాటి గోపాల్ రెడ్డి అధ్యక్షతన తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కారణంగా రాయలసీమ ప్రాంత అభివృద్ధి కోసం ఏ రాజకీయ పార్టీకి చెందిన వారు ముందుచూపుతో ఆలోచించకుండా పదవుల కోసమే పని చేశారన్నారు. తమ స్వార్థ రాజకీయ పురోగతికి మాత్రమే ప్రాధాన్యత నిస్తూ ప్రజాప్రతినిధులు రాజకీయ పార్టీలు నేడు అమరావతి లేదా విశాఖపట్నం జపం చేస్తున్నారని విమర్శించారు. రాయలసీమ సస్యశ్యామలం కోసం ఏడేళ్లకు ముందు సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన చేశామన్నారు. శంకుస్థాపన 7వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 31న జరుగనున్న సిద్దేశ్వరం జల జాగరణ దీక్షను విజయవంతం చేయాలని, ఇందుకోసం ప్రతి రాయలసీమ పౌరుడు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం పట్టిసీమ పూర్తయిన వెంటనే ఆదా అయిన కృష్ణా జలాలను సీమ ప్రజలకు అందిస్తామని నమ్మించి, తీరా ప్రాజెక్టు పూర్తయిన తర్వాత మిగులు జలాలను రాయలసీమ ప్రాజెక్టులకు కేటాయించలేదన్నారు. నేడు అధికారంలో ఉన్న ప్రభుత్వం శ్రీబాగ్ ఒడంబడికను గౌరవిస్తామంటూ, న్యాయ రాజధాని కర్నూలు అని ప్రకటించి ఆ దిశగా న్యాయ విభాగాలకు సంబంధించిన కృష్ణా నది యాజమాన్య బోర్డు కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి కార్యాలయం కర్నూలులో ఏర్పాటు చేస్తామని చెబుతూనే తమ ఆర్థిక, రాజకీయ కేంద్రమైన విశాఖపట్నానికి ఈ కార్యాలయాలను తరలిస్తున్నారని విమర్శించారు. మాంగాటి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ గాలేరు-నగరి సుజల స్రవంతి ద్వారా తిరుపతి గ్రామీణ మండలంతో పాటు తిరుపతి నగర ప్రజలకు నీరు అందించాలని ఉద్దేశంతో శిలాఫలకం వేశారని ఆనాటి నుండి నేటి వరకు కొందరు ప్రజాప్రతినిధుల ముందు చూపుతో అక్కడక్కడ చిన్నపాటి కాలువలు తీశారని, ఆ కాలువలలో నిండిన నీరు ఆ సమీప ప్రాంతాల నేటి అవసరాలను తీరుస్తోందన్నారు. ఈ నేపథ్యంలో రాయలసీమ హక్కుల అమలుకు పాలకులపై ఒత్తిడి పెంచడానికి మే 31 సాయంత్రం 6 గంటల నుండి జూన్ 1 ఉదయం 10 గంటల వరకు సిద్దేశ్వరం జల జాగరణ దీక్షలో ప్రతి రాయలసీమ వాసి పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా జల జాగరణ దీక్ష గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉమ్మడి చిత్తూరు జిల్లా నాయకులు శివశంకరరాజు, భాస్కర్, శ్రీనివాసరెడ్డి, విద్యార్థి నాయకులు ఉత్తరాది విజయ్, సమితి ప్రచార కార్యదర్శి నిట్టూరు సుధాకర్ రావు, కెఎస్. రాజు, పి.జయరామిరెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం

గూడూరు పురపాలక కమిషనర్ సాయినాథ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలని గూడూరు పురపాలక సంఘ కమిషనర్ సాయినాథ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని మాలవ్య నగర్ సచివాలయంలో ఆర్.ఆర్.ఆర్ సెంటర్‌ను పురపాలక కమిషనర్ ప్రారంభించారు . ఈ సందర్భంగా పురపాలక కమిషనర్ సాయినాథ్ మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ అమ్మే దుకాణాలపై పలుసార్లు దాడులు చేసి, అపరాధ రుసుం విధించినా పూర్తిస్థాయిలో నిర్మూలన జరగడం లేదన్నారు. ప్రజలందరూ ప్లాస్టిక్ నిషేధానికి, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు మంత్రి ఆర్కే రోజా సన్మానం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు మండలం తడుకు పంచాయతీకి చెందిన ముగ్గురు వాలంటీర్లు ఉత్తమ సేవలందించినందుకు అవార్డులకు ఎంపికయ్యారు. తడుకు పంచాయతీలోని మజ్జిగగుంట గ్రామానికి చెందిన తులసీరామ్, రంగుంటకు చెందిన అంజేరయ్య, బాలాజీలకు సేవారత్న అవార్డులు అందడం సంతోషకరమని వైసీపీ సీనియర్ నాయకులు గూళూరు కరుణ వారిని అభినందించారు. వాలంటీర్లను శుక్రవారం తిరుపతిలో జరిగిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఉత్తమ సేవారత్న అవార్డులను అందించి వారిని మంత్రి ఆర్.కె.రోజా, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. వీరిని ఎంపీడీవో ఇందిరమ్మ, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు అభినందించారు.

భరత్‌రెడ్డికి అశ్వం అవార్డు

ప్రజాశక్తి- తొట్టంబేడు: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డికి అశ్వం అవార్డు ప్రదానం చేశారు. హైదరాబాదులోని తెలంగాణ సరస్వతి పరిషత్ లో ఈ నెల 17వ తేదీ బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలవగుంట భరత్ రెడ్డికి ఈ అవార్డు అందజేశారు. కలవగుంట భరత్ రెడ్డి చేస్తున్న సామాజిక కార్యక్రమాలను గుర్తించి వే ఫౌండేషన్, జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను వారు సంయుక్తంగా అశ్వం అవార్డుకు ఈయనను ఎంపిక చేశారు. కలవగుంట భరత్ రెడ్డికి ఈ అశ్వం అవార్డును ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్, జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను వ్యవస్థాపక అధ్యక్షులు ఎంవీఎల్ నాగేశ్వరరావు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌతంరాజు, రాజ్ కుమార్ తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కాగా అశ్వం అవార్డు అందుకున్న కలవగుంట భరత్ రెడ్డిని పలువురు అభినందించారు.

ప్రజల్లో భక్తిభావాన్ని పెంచేందుకు కల్యాణోత్సవం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆధునిక యుగంలో నూతన టెక్నాలజీలతో పరుగులు పెడుతున్న సమాజంలోని ప్రజలకు భక్తి భావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీశ్రీశ్రీ గోవిందమాంబల ఆరవ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మైలాపూర్ భారతి పేర్కొన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆదివారం మహతి కళాక్షేత్రం వేదికగా నిర్వహించే ఈ కళ్యాణ మహోత్సవానికి విశ్వబ్రాహ్మణులు, కుల పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గనులు, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఎం.కార్తీక్, మార్గాచార్యుల ఉమాపతి ఆచారి, గిరిబాబు ఆచారి, రామయ్య ఆచారి, మురళీకృష్ణమాచారి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కటికాల నారాయణకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -కోట : గూడలి పంచాయతీ పరిధిలోని ప్రకాశం కాలనీకి చెందిన కటికల నారాయణకు అల్లం రమణయ్య రూ.వెయ్యి అందజేశారు. కార్యక్రమంలో వేములూరు బాబు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీమా...

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం బాలినాయుడుకండ్రిగ పంచాయతీ వెంకటరెడ్డి కండ్రిక హరిజనవాడలో కన్నయ్య కుమారుడు వారం క్రితం మరణించారు. వీరి కుటుంబానికి మంత్రి రోజా, సోదరులు రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.20 వేలు, వైఎస్ఆర్ బీమా రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వడమాల వైస్ ఎంపీపీ లోకేష్, మండల కన్వీనర్ సుబ్రహ్మణ్యంరెడ్డి, సీనియర్ నాయకులు నందయ్య , సచివాలయ కన్వీనర్ సురేష్ రాజు, సచివాలయ సెక్రటరీ వెల్ఫేర్ , డిజిటల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

ప్రజాశక్తి -సత్యవేడు: సత్యవేడు వీఎంకే కల్యాణ మండపంలో 21వ తేదీ ఆదివారం వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ప్రముఖ ఆడిటర్, టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి రోశయ్య పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు. పశ్చిమ రాయలసీమ జోన్ ఆధ్వర్యంలో ప్రముఖ సైకాలజిస్ట్, వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు శిక్షణ ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. శిక్షణకు వచ్చే వారికి ఉచిత భోజనం, మెటీరియల్, సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందన్నారు. పేరును నమోదు చేసుకునేవారు మొబైల్ నెంబర్ 8340908454ను సంప్రదించాలని కోరారు.

ఆశా వర్కర్ భర్త మృతి

ప్రజాశక్తి-పాకాల: ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు నవనీత భర్త జగదీష్ మతికి సిఐటియు సీనియర్ నాయకులు మధుసూదన్ రావు, నరేంద్ర, ప్రసాద్ శనివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పులిచెర్ల మండల పరిధిలోని కల్లూరు క్రాస్ వద్ద లారీ ఢీకొనడంతో జగదీష్ మతి చెందాడు. ఆశ కార్యకర్త కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

గండవరం రవీంద్రారెడ్డి వర్ధంతి వేడుకలు

ప్రజాశక్తి-కోట: తిన్నెలపూడి పంచాయతికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు, మాజీ రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి స్వర్గీయ గండవరం రవీంద్ర రెడ్డి 8వ వర్ధంతి వేడుకలను కోట క్రాస్ రోడ్డు వద్ద ఉన్న రైస్ మిల్లు వద్ద రవీంద్ర రెడ్డి తనయురాలు గండవరం. సుష్మా రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గండవరం రవీంద్ర రెడ్డి తెలుగుదేశం పార్టీకి అందించిన సేవలు మరువ లేవని కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు టిడిపి నాయకులు,అభిమానులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వివేకానంద విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-గూడూరు టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన పాలిసెట్ ఫలితాల్లో గూడూరు పట్టణంలోని శ్రీ వివేకానంద కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ చూపారు. పరీక్షకు 24 మంది హాజరు కాగా 24 మంది ఉత్తీర్ణులయ్యారు. అత్యధికంగా నమ్రత అనే విద్యార్థి 94 మార్కుల సాధించి రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించిందని కోచింగ్ సెంటర్ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని వి.ఎస్ .ఆర్ .పాఠశాల అధినేత బాలకష్ణరాజు శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ ప్రతినిధులు మల్లి కార్జున తదితరులు పాల్గొన్నారు.

బెదిరించి భూ ఆక్రమణ..!

ప్రజాశక్తి - బాలాయపల్లి: మండలంలోని గొ ట్టికాడు గ్రామంలోని అగ్రకులాల వారు దళితులు గురవమ్మ కుమారులు రమేష్, వసంత కు మార్‌లను బెదిరించి భూ ఆక్రమణ చేశారని గూడూరు కె.వి.పి.ఎస్ ఆధ్వర్యంలో శనివారం తహశీల్దారుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కె.వి.పి.ఎస్ పట్టణ నాయకులు ప్రసాద్ మాట్లాడుతూ గత 25 ఏళ్లగా 3 ఎకరాలు భూమిని ప్రభుత్వం ఇచ్చిందని.. అప్పటి నుంచి సాగు చేసుకుంటున్న భూమిని ఎలా ఆక్రమిస్తారన్నారు. దళితలపై దారుణంగా బెదిరింపు చర్యల చేపట్టారని..1.50 ఎకరాల భూమిని పుచ్చలపల్లి హరి, శ్రీనివాసులురెడ్డి లు రాత్రికి రాత్రి ఆక్రమించి సాగు చేసుకోవడంతో పోలీసుల దష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని తెలిపారు. స్పందించిన తహశీల్దారు శ్రీనివాసులు వసంతమ్మ భూములు వెంటనే వారికి చూపించాలని తెలిపారు. కార్యక్రమంలో కె. వి. పి.ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

టీడీపీ అధికారంతోనే లబ్ధిదారులకు టిడ్కో గృహాలు

మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

ప్రజాశక్తి -గూడూరు: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే టిడ్కో అపార్ట్మెంట్ నివాసాలను లబ్ధిదారులకు ఉచితంగా అందిస్తామని ఆ పార్టీ నాయకులు, గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు నియోజకవర్గంలో సిలికా అక్రమ మైనింగ్‌పై ఈనెల 22వ తేదీ అఖిలపక్షం ఆధ్వర్యంలో సిలికా మైన్‌లు పరిశీలిస్తామని తెలిపారు. ఈనెల 21వ తేదీ నెల్లూరు టిడిపి కార్యాలయం జరిగే మినీ మహానాడులో నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొనాలని తెలుగుదేశం శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు శీలం కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు , బిల్లు చెంచురామయ్య, ఇజ్రాయిల్, వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోట : ప్రజల పక్షాన నిలబడి పోరాడాలని, రాబోయే రోజుల్లో అధికారం తెలుగుదేశం పార్టీదేనని మాజీ శాసనమండలి ఛైర్మన్, టీడీపీ మాజీ ఎమ్మెల్సీ ఎండీ.షరీఫ్ అహ్మద్ తిరుపతి పార్లమెంట్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్‌కు సూచించారు. ఈ సందర్భంగా తిరుపతిలో జరిగిన మినీ మహానాడులో కోట పట్టణానికి చెందిన తిరుపతి పార్లమెంట్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్.జలీల్ అహ్మద్ మర్యాదపూర్వకంగా కలిశారు. జగన్ ప్రభుత్వ మొండి వైఖరితో జిల్లాలోని మైనారిటీలకు వాటిల్లుతున్న నష్టాలను జలీల్ ఆయనకు వివరించారు. స్పందించిన మాజీ ఎమ్మెల్సీ షరీఫ్ రానున్నది మన తెలుగుదేశం ప్రభుత్వమేనని అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని ఆయన జలీల్ తో అన్నారు. అప్పటివరకు ప్రజల పక్షాన నిలబడి పోరాడాలని జలీల్ కు ఆయన సూచించారు. జగన్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను, ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని రాబోయే ఎన్నికల్లో ప్రజాక్షేత్రంలో టీడీపీదే అంతిమ విజయం అని ఆయన జలీల్ అహ్మద్ తో అన్నారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టాలీవుడ్ అగ్రహీరో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ఘనంగా జరిగాయి. ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకుడు తేజరెడ్డి ఆధ్వర్యంలో, న్యాయవాది గరికిపాటి రమేష్ సమక్షంలో ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ అభిమానులు కేక్ కట్ చేసి, బాణాసంచాను కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం పేదలకు మజ్జిగ, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉంగరాల మునయ్య, గంగపుత్ర గాంధీ, జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

పాకాల: మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు వారసుడు జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలను శనివారం బస్టాండ్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు పెద్ద ఎత్తున చేరుకుని రక్తదానం చేపట్టారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ మండల నాయకులు అఖిల్ చౌదరి, మోహనకష్ణ, ప్రతాపనేని నాని, బుల్లినేని విష్ణు, అనంతనేని బాలాజీ, లోకేష్, జగదీష్, ఎన్టీఆర్ మండల అభిమానులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని పెన్నేపల్లి గ్రామంలో శనివారం జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. యూత్ టిడిపి మాజీ ప్రెసిడెంట్ ఏడుకొండలు, కేశవులు ఆధ్వర్యంలో తిరుపతి పార్లమెంట్ టిఎన్‌టియుసి ఉపాధ్యక్షుడు వెంకటాచలపతి కేకు కోసి పంచిపెట్టారు. చలివేంద్ర ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హర్ష, కుశ్వంత్, నవీన్, నరసింహ, మహేష్, వంశీ, ధర్మ, వాసు, వంశీ, మదన్మోహన్, గురునాథం, జై చంద్ర, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : సినీ నటుడు ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా పుత్తూరు మున్సిపాలిటీ లో ఎన్టీఆర్ అభిమానుల సమక్షంలో అత్యంత వైభవంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. గ్రామ దేవత ఆరేటమ్మ ఆలయంలో ఎన్టీఆర్ పేరుపై అర్చన, పూజల అనంతరం 101 కొబ్బరికాయలు కొట్టారు. కార్వేటినగరం సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి, ఆర్.డి.యం రైల్వే గేటు వరకు నినాదాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. 1000 మందికి అన్నదానం చేపట్టారు.

ఇద్దరు తమిళనాడు హంతకుల అరెస్టు

ప్రజాశక్తి-నాగలాపురం: నాగలాపురంలో గురువారం సాయంత్రం జరిగిన మునస్వామి హత్య కేసులో నిందితులు మణి, బాలు అలియాస్ బాలసుబ్రమణ్యంలను పోలీసులు అదుపులో తీసుకున్నారు. హత్య జరిగిన 24 గంటలు గడవక ముందే నిందితులను పట్టుకోవడంపై పోలీసులు శభాష్ అనిపించుకున్నారు. నాగలాపురం లో సంచలం రేకెత్తించిన మునస్వామి హత్యపై పోలీసులు అప్రమత్తమయ్యారు. రాత్రికి రాత్రి చెన్నైలోని తిరుమల్ వాయల్ సమీపంలోని నిందితుల స్వగ్రామానికి చేరుకొని మణి, బాల అలియాస్ బాలసుబ్రమణ్యం అనే ఇద్దరిని అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.90 వేలు నగదు, హత్యకు ఉపయోగించిన కత్తి , రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. శనివారం పుత్తూరు డి.ఎస్.పి శ్రీనివాస రావు వెల్లడించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగలాపురం మండలం కాలంజేరి గ్రామానికి చెందిన మునస్వామి గేదెలు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. ఈ క్రమంలో తమిళనాడుకు చెందిన మణికంఠ, బాలసుబ్రమణ్యం పది రోజుల క్రితం మునస్వామి వద్ద 7 బర్రెలు, 7 దూడలు కొనుక్కొని వెళ్లగా అందులో ఒక బర్రె అనారోగ్యంతో పొదుగు వ్యాధి కారణంగా పాలు పితికేందుకు సహకరించలేదని... అందుకోసం సుమారు రూ.10 వేలు ఖర్చుపెట్టి వైద్యం చేయించినా కాలేదని .. అందుకు మునస్వామిపై కోపంతో 13వ తేదీ రాత్రి 8 గంటలకు బర్రెలు దాని దూడను తీసుకొని వచ్చి కాలంజేరిలోని మునస్వామి, అతని తండ్రి మారిముత్తులకు అప్పజెప్పి ఆరోగ్యంతో ఉండే బర్రెలు ఇవ్వాలని.. లేకపోతే రూ.1.25 లక్షలు, వైద్యం కోసం ఖర్చుపెట్టిన రూ.10 వేలు కలిపి మొత్తం రూ.1.30 లక్షలు ఇవ్వాలని మణికంఠం, బాలసుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. లేకపోతే చంపుతామని మునుస్వామిని బెదిరించారు. అందుకు మునస్వామి అతని తండ్రి భయపడి తమ వద్ద కొత్తగా దూడ లేదని.. అందుకు ఇవ్వాల్సిన రూ.30 వేలు పోను రూ.90 వేలు నాలుగు రోజుల్లో తిరిగి ఇస్తామని ఇరువురిని పంపించేశారు. అయితే 18వ తేదీ ఉదయం 8.30 గంటలకు మణికంఠం, బాలసుబ్రమణ్యం ఇద్దరూ కలిసి మునస్వామి ఇంటి దగ్గరికి వెళ్లి రూ.లక్ష ఇవ్వాలని లేదంటే చంపుతామని బెదిరించడంతో .. మునస్వామి ప్రస్తుతం నా దగ్గర డబ్బులు లేవని.. నాగలాపురంలో తెలిసిన వారి వద్ద అప్పు తెచ్చి ఇస్తానని చెప్పి వెళ్లి తిరిగి మధ్యాహ్నం 12.30 గంటలకు మునస్వామి రూ.90 వేలు తెచ్చి ఇచ్చి మీరు వైద్యం చేసిన రూ.10 వేలు అడిగితే మర్యాదగా ఉండదని.. ఎంతకన్నా తెగిస్తానని మునస్వామి బెదిరించగా వారు డబ్బులు తీసుకొని మిగిలిన డబ్బులు కోసం మునస్వామిని ఎలాగైనా చంపాలని ఉద్దేశంతో నాగలాపురం పక్కనే ఉన్న వైన్‌షాపులో మందు తీసుకుని ఊరు చివర బాలుశెట్టి వ్యవసాయ మోటార్ షెడ్ వద్దకు వెళ్లి మునస్వామిని పిలిపించి మందు తాగించి కత్తితో నరికారని డి.ఎస్.పి శ్రీనివాసరావు వెల్లడించారు. డీఎస్పీతోపాటు సత్యవేడు సీఐ శివకుమార్‌రెడ్డి కేసును త్వరగా ఛేదించిన నాగలాపురం ఎస్ఐ హనుమంతప్ప, సిబ్బందిని అభినందించారు.

కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-పెళ్లకూరు: కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని జిల్లా ఉప కార్యదర్శి ముకుంద డిమాండు చేశారు. శనివారం కానూరు రాజుపాలెం గ్రామంలోని వడ్డీరామిగుంట చెరువులో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు కనీసం నీటి సౌకర్యం లేదని, చెరువు ప్రాంతమైనందున చెట్లు, పొదలు, గట్టులు ఎక్కువగా ఉన్నాయని, ఇలాంటి ప్రాంతంలో ఏవైనా చిన్న చిన్న ఇబ్బందులు జరిగినా ప్రథమ చికిత్స కిట్లు లేవని..అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

తప్పులతడకగా ఓటర్ల జాబితా

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నియోజకవర్గంలో ఎన్నికల కమిషన్ విడుదల చేసిన 2023 ఓటర్ల జాబితా మొత్తం తప్పుల తడకగా ఉందని తెలుగు యువత అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్ నాయుడు తెలిపారు. తిరుపతి నగరంలోని ఒక్కో డివిజన్ పరిధిలోని పోలింగ్ బూత్ లలో ఉన్న ఓటర్లను ఇష్టానుసారం బూత్ ల నుండి మార్చేశారని ఆరోపించారు. దీంతో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయన్నారు. తమ ఓటు ఏ బూతు పరిధిలో ఉందో నగరంలోని ప్రజలు ముందుగానే తెలుసుకొని దానికి తగ్గ నమోదు ప్రక్రియను చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. నియోజవర్గ పరిధిలోని 262 బూత్ లలో శాశ్వత బిఎల్‌ఓ లను నియమించాలని డిమాండ్ చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక సజావుగా ఉన్న ఓటర్ల జాబితాను వారికి అనుకూలంగా ఆపరేటర్ల పై ఒత్తిడి తీసుకొచ్చి ఇష్టం వచ్చినట్లు దొంగ ఓట్లను చేర్చి ఓటర్ల జాబితాను చిందరవందర చేశారన్నారు. ఇందుకు గతంలో జరిగిన పార్లమెంటు, నగర పాలక సంస్థ ఎన్నికలే తార్కాణమన్నారు. ఇప్పటికీ చనిపోయిన వారి ఓట్లు, డబల్ ఎంట్రీలు ప్రస్తుతం ఎలక్షన్ కమిషన్ విడుదల చేసిన 2023 ఓటర్ల జాబితాలో అలానే ఉన్నాయన్నారు. ఎలక్షన్ కమిషన్ బిఎల్‌ఓ ల ద్వారా ఇంటెన్సీవ్ రివిజన్ చేయించాలని, అప్పుడే నిజమైన ఓటరు ఓటు హక్కు వినియోగించుకోవడానికి వీలు కల్పించినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఖాజా, శరత్ చౌదరి, గాలిపవన్ చౌదరి, మెహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వకంగానే గిరిజనులపై అక్రమ కేసులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలోని ఎస్టీలను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి వేధింపులకు గురి చేస్తూ అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారని రాష్ట్ర మాజీ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ దారు నాయక్ విమర్శించారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో జరుగుతున్న దాడులను గమనిస్తుంటే ఒక కార్యచరణతో గిరిజనులను అణిచివేసే దిశగా పనిచేస్తున్నారని స్పష్టమవుతుందన్నారు. తిరుపతి పార్లమెంట్ టిడిపి ఎస్టీసెల్ అధ్యక్షులు సుబ్బయ్య టిడిపి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటు ప్రభుత్వం గిరిజనులపై చేస్తున్న దాడులు, దుర్మార్గ దౌర్జన్యాలకు అవినీతి అక్రమాలకు సోషల్ మీడియాతో ప్రశ్నించినందుకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుబ్బయ్యపై కక్ష సాధింపులో భాగంగానే అక్రమ కేసులు బనాయించారన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వానికి రాష్ట్రంలోని గిరిజనులు తగిన బుద్ధి చెబుతారన్నారు. టిడిపి నాయకులు మొగిలి కల్లయ్య, కత్తి పద్మ, వెంకట్రమణ నాయక్, మనోహర్ నాయక్, గోపాల్, విజయ్ కుమార్ నాయక్, తిరుమల శెట్టి శ్రీను, రవికుమార్, చలపతి, రెడ్డి నాయక్ పాల్గొన్నారు.